ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.7 • కనిష్ఠం 10.0
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 6 డిసెంబరు 2025



నోటా గెలిస్తే?

» నోటాకు అందరికన్నా ఎక్కువ ఓట్లు పడితే.. రెండో స్థానంలో ఉన్న అభ్యర్థే విజేత

వివరాలు 7వ పేజీలో....



మహిళా అభ్యర్థులు.. దరఖాస్తులు చేసుకోవాలి

ఉట్నూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టాటా ఎలక్ట్రానిక్స్ మరియు కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చర్ సంస్థలో స్మార్ట్ ఫోన్ అసెంబ్లింగ్ చేసే ఉద్యోగాలకు 18 సంవత్సరాల నుంచి 31 సంవత్సరాల వయసు గల మహిళ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని టీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగం యొక్క పూర్తి వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయన్నారు.పని చేయగల ప్రదేశం హోసూర్, తమిళనాడు జాబ్ ప్రోఫల్ - అసెంబ్లర్, మహిళలకు మాత్రమే విద్యార్హత ఇంటర్‌పాస్, డిగ్రీపాస్,ఐటీఐ ఏదైనాకోర్సు జీతం సీటీసీ నెలకు రూ.20000, రూ.14800 నెలకు ఈఎస్‌టీ మరియు పీఎఫ్ కట్ చేసిన వచ్చే జీతం ఉచిత భోజనం మరియు వసతి ఇవ్వబడునన్నారు. వివరాలకు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ కార్యాలయంలోని గిరిజన శిక్షణ కేంద్రంను సంప్రదించగలరన్నారు.

సీసీఐని ప్రైవేటుపరం చేస్తే ఊరుకోం

» మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆక్షేపన



మాట్లాడుతున్న మాజీమంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీసీఐ పరిశ్రమను ప్రైవేట్ పరం చేసేందుకే స్థానిక ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజా పాలన ప్రజా విజయోత్సవల్లో భాగంగా జరిగిన సభలో ఆ విషయం బయటపడిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆక్షేపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విజయోత్సవాల పేరిట సభలు నిర్వహిస్తే అందులో బీజేపీ ఎమ్మెల్యే పాల్గొని ముఖ్యమంత్రిపై పొగడ్తల వర్షం కురిపించడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఓవైపు బీజేపీ శ్రేణులు సీఎం హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనలు నిర్వహిస్తుంటే... ఆదిలాబాద్ ఎమ్మెల్యే మాత్రం ఆయనను పొగుడుతున్నారని అన్నారు. గతంలో సీసీఐ పునరుద్ధరణ విషయమై కేంద్ర మంత్రులను కలిసిన సమయంలో సానుకూలంగా స్పందించారని గుర్తు చేసిన ఆయన... ప్రస్తుతం పరిశ్రమను ప్రైవేట్‌కు అప్పగించేలా ప్రయత్నాలు జరుగుతుండడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇందులో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, మెట్టు ప్రహ్లాద్, సాజిదోద్దీన్, గండ్రత్ రమేష్, సేవ్వ జగదీష్, దాసరి రమేష్, పండ్ల శ్రీనివాస్, జంగిలి ప్రశాంత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలు కోసం ఐటీడీఏ పల్స్ యాప్ ఆవిష్కరణ

ఉట్నూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఐటీడీఏ పరిధిలో గల నాలుగు జిల్లాలు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల మరియు ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో/హాస్టల్‌లలో కామన్‌డైట్ మెనూ అమలు చేయడానికి ఐటీడీఏ పల్స్ యాప్‌ని ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా హెచ్‌ఎంలు, డిప్యూటీ వార్డెన్లు ప్రతీరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ మరియు రాత్రి భోజనం ఫోటోలు అప్లోడ్ చేయడం జరుగుతుందని ఐటీడీఏ పీవో అన్నారు. ఇప్పటి వరకు హెచ్‌ఎంలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఈ ఆప్‌ని మంచిగా ఉపయోగించి ఫోటోస్ అప్లోడ్ చేస్తున్నారన్నారు. ఈ ఐటీడీఏ పల్స్‌ఆప్ ద్వారా భోజనంలో పెట్టేటటువంటి ఆహారం ఫోటోలు నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ యాప్‌లో ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆహారంలో నాణ్యత, పరిశుభ్రతను నిర్ధారించడానికి ఫొటోలను అప్లోడ్ చేసిన తర్వాత రోజువారీగా పీవో పేషి నుంచి స్వయంగా పర్యవేక్షిస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి, సేవా భావం అలవర్చుకోవాలి

» జిల్లా కలెక్టర్ రాజర్షి షా
» ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవ వేడుకలు
» పాల్గొన్న అధికారులు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ క్యాడెట్లు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే దేశ భక్తి, సేవాభావం అలవర్చుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఎన్‌సీసీ క్యాడెట్లకు కలెక్టర్ తనవంతు విరాళాలన్ని అందజేశారు. ప్రజలందరూ ఇందులో భాగస్వాములు కావాలనీ పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ కాడేట్‌లను పలు వివరాలు అడిగి తెలుసుకుని వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే దేశ భక్తి, సేవాభావం అలవర్చుకోవాలని, దేశ రక్షణకు అంకితమైన సైనికుల కుటుంబాల సహాయార్థం ఎన్‌సీసీ క్యాడెట్లు ఎక్కువ మొత్తంలో విరాళాలు సేకరించాలని సూచించారు. శత్రు దేశాల నుంచి రక్షణను కల్పిస్తున్న మన సైనికులకు ఎంత విరాళాలు అందజేసిన తక్కువేనని అన్నారు. ఐదు ఎన్‌సీసీ క్యాడేట్ జట్లు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో, ప్రభుత్వ కార్యాలయాలు, అనుబంధ సంస్థలు, దుకాణాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో పౌరుల చొక్కాలకు స్టిక్కర్‌లు అతికించి విరాళాలు సేకరించి సైనిక సంక్షేమ సహాయ నిధి ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. ఉదార దాతలు డీడీ లేదా చెక్కు ద్వారా డైరెక్టర్, సైనిక వెల్ఫేర్ పేరున జమ చేయవచ్చని వివరించారు. ఇందులో ఇన్‌చార్జి ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి బి.స్రవంతి, మాజీ సైనికులు శంకర్ దాస్, దేవన్న, అశోక్, ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహం చట్టరీత్యా నేరం

ఆదిలాబాద్ టౌన్: బాల్య వివాహంలో పాల్గొన్న వారందరిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాల్ వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, షూర్ ఎన్‌జీఓ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి పండితులు, మౌలానాలు, పాస్టర్‌లు హాజరయ్యారు. ముందుగా జిల్లా బాలల సంరక్షణ అధికారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనకై జిల్లా బాలల పరిరక్షణ విభాగం, షూర్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో చేస్తున్న అవగాహన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహ నిషేధ చట్టం- 2006పై అందరికీ అవగాహన ఉన్నప్పటికీ బాల్యవివాహాలు నేటికి జరగడం బాధాకరమన్నారు. బాల్య వివాహాల్లో పాల్గొన్న వారందరిపై ఎఫ్ఐర్ నమోదు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చిన్న వయసులో పెళ్లిలు చేస్తే వారి భవిష్యత్తుతో పాటు పుట్టబోయే పిల్లల ఆరోగ్యం పడవుతుందని, బాల్య వివాహాల నిర్మూలనపై ముహూర్తాల సమయంలో, ఆయా పూజా కార్యక్రమాల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఆర్థిక సమస్యలతో పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని, చదివే వయసులో పెళ్లి చేయొద్దని వారి పేదరికాన్ని జయించి ఉన్నతస్థాయిలో స్థిరపడ్డ విజయగాథలతో తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా సంక్షేమ అధికారి కె.మిల్కా, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, సీడబ్ల్యూసీ ఛైర్మన్ వెంకట్ స్వామి, సభ్యులు సమీర్ ఉల్లఖాన్, దశరథ్, డేవిడ్, షూర్ ఎన్‌జీఓ జిల్లా కోఆర్డినేటర్ వినోద్, అర్చక సంఘం సభ్యులు, చర్చి పాస్టర్‌లు, మౌలానా ఖాజీలు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్‌లతో కలెక్టర్ రాజర్షి షా



అవగాహన గోడ ప్రతులను ఆవిష్కరిస్తూ..



మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్



హాజరైన హెచ్‌ఎంలు, డిప్యూటీ వార్డెన్లు, తదితరులు

ఆశ్రమ పాఠశాలల్లో మెనూ.. అమలు బాధ్యత హెచ్‌ఎంలదే

» ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్
» కొమురంభీం ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా అధికారుల మీటింగ్
» పాల్గొన్న సంక్షేమ అధికారులు, వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు

ఉట్నూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో సక్రమంగా మెనూ అమలు చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్ సమావేశం మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమ అధికారులు, డిప్యూటీ వార్డెన్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమన భోజనం అందించాలని, నూతన మెనూ అమలులో చిన్నపాటి ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, దానిని డీడీల ఆధ్వర్యంలోని హామీల ద్వారా అందరికి ఆమోదయోగ్యమైన మార్పులు చేపడతామని తెలిపారు. మెను అమలు మానిటరింగ్ కొరకు నూతన యాప్‌ను రూపొందించామని, దీని ద్వారా సులువుగా మెను అమలు తీరు పర్యవేక్షించవచ్చని తెలిపారు.ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవమరించిన వార్డెన్ల పై తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.విద్యార్థులకు భోజనం చేసే ముందు తప్పనిసరగా సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవడం ఒక క్రమపద్ధతిలో మంచి అలవాట్లు నేర్పించాలని అన్నారు. ప్రతి విద్యార్థికి మంచి అలవాట్లు పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన అభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు జాదవ్ అంబాజి, రీజినల్ కో ఆర్డినేటర్ అగస్టిన్, ఏసీఎంఓలు, బాలికల అభివృద్ధి అధికారులు మేస్రంచాయ, కోట్నాక్ శకుంతల, ఏటీడబ్ల్యూఓ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

ఉట్నూర్: క్రీడల్లో గిరిజన విద్యార్థులు రాణించడం అభినందనీయమని ఉత్తమ క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సహిస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో క్రీడాకారులను కలిశారు. ఇటీవల భువనగిరి, పటాన్చెరు, సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రా స్థాయి జూనియర్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఖోఖో క్రీడల్లో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులను అభినందించారు. ఇటీవల కాలంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లోను సత్తా చాటి టీడీఏకు గిరిజన సంక్షేమ శాఖకు మంచి గుర్తింపు తెచ్చారని కొనియాడారు. గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ సందర్భంగా కోచ్‌ల సేవలను ప్రశంసించారు. అనంతరం పటాన్చెరులో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో బంగారు పథకాలు సాధించిన యాదవ్‌శావ్, శంకర్, సురేందర్, నిఖిల్‌కుమార్, జైతులను, భువనగిరిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి ఖోఖోపోటీల్లో బంగారు పతకాలు సాధించిన నిఖిల్‌కుమార్, సురేందర్, శంకర్, జైతు, సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మెట్‌లో బంగారు పతకాలు సాధించిన శ్రీ కాంత్, నగేష్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబాజిజాదవ్, ఏటీడీఓ సదానందం, ఏసీఎంఓ జగన్, జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ఫిజికల్ డైరెక్టర్లు జాదవ్‌హేమంత్‌నాయక్, మేస్రంగంగారాం, కోచ్‌లు శివకృష్ణ, శేఖర్, రాజ్‌కుమార్‌లున్నారు.

సర్పంచ్ సహా.. ఏడు వార్డుల నామినేషన్‌లు తిరస్కరణ : ఎంపీడీవో

భీంపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో స్థానిక ఎన్నికల రెండో విడత నామినేషన్‌లో భాగంగా ఆయా కారణాలతో ఒక సర్పంచ్, ఏడు వార్డు సభ్యుల నామినేషన్‌లు తిరస్కరణకు గురయ్యాయి. ఈ విషయాన్ని శుక్రవారం పరిశీలన తర్వాత ఎంపీడీవో గోపాల్ కృష్ణరెడ్డి, ఆర్డీవో స్రవంతిలు వెల్లడించారు. బిల్సారి రాంపూర్‌కి చెందిన సర్పంచ్ అభ్యర్థి గెడం ముకుందా రావు నామినేషన్ దరఖాస్తులో సంతకం చేయకపోవడంతో ఆ నామినేషన్ తిరస్కరించారు. అలాగే సంతకం మరో చోట చేయటం, ప్రతిపాదకులు మరో వార్డు నుంచి ఉండటం లాంటి కారణాలతో పిప్పల్కోటిలో రెండు, గుబిడి పల్లిలో రెండు, ఇందూర్ పల్లి లో రెండు, గొల్లగాడ్‌లో ఒక్కటి నామినేషన్‌లు తిరస్కరించారు. కాగా పిప్పల్కోటిలో 9వ వార్డులో ఇద్దరు అభ్యర్థుల నామినేషన్‌లు తిరస్కరణకు గురి కావటంతో మిగిలిన ఒక్కరిని ఏకగ్రీవం అయినట్లుగా బావిస్తున్నారు.


పట్టణంలో 10వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు : జిల్లా అధ్యక్షుడు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 10వ తెలంగాణ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను పట్టణంలోని ఒక్లే ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని రవికుమార్ తెలిపారు. ఈనెల 7వ తేదీన జిల్లా స్థాయి, 8, 9వ తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారి వయస్సు ప్రకారం ఐదు గ్రూపులుగా విభజించినట్లు తెలిపారు. పోటీలను విజయవంతంగా పూర్తి చేసేందుకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమ్ము కృష్ణ, ఉపాధ్యక్షులు లాల మున్న, సుంకు చిన్న పటేల్, బారే శ్రీధర్, కోశాధికారి హరిచరణ్‌ల నేతృత్వంలో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

రెండు రోజుల పాటు సోయా పంట కొనుగోళ్ల నిలిపివేత

తాంసి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలో కొనుగోలు చేస్తున్న సోయా పంట కొనుగోళ్లను రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు సీఈఓ కేశవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి సోమవారం నుంచి కొనుగోలు ప్రారంభిస్తామని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. అంతేకాకుండా నాణ్యమైన సోయలు మాత్రమే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని ఆయన వివరించారు. రంగు మారిన, తేమగా ఉన్న సొయాలను కొనుగోలు చేయబడవని ఈ విషయాన్ని సోయా రైతులు గమనించాలని పేర్కొన్నారు.

పలుచోట్ల ఏకగ్రీవాల పర్వం 7



పల్లెల్లో.. ప్రచార సందడి

పోటాపోటీగా ప్రచారానికి దిగుతున్న అభ్యర్థులు

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రచార సందడి కనిపిస్తుంది. తొలివిడత ఎన్నికల గుర్తులు కేటాయించడంతో ప్రచారం మరింతగా ఊపందుకుంటుంది. శనివారం రెండవ విడత ఎన్నికలకు సంబంధించిన గుర్తులను కేటాయించనున్నారు. ప్రస్తుతం మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది.

» జిల్లాలో తొలివిడత ఎన్నికల గుర్తులు కేటాయింపు
» మద్దతును కూడగట్టేందుకు కుల సంఘాలకు గాలం
» పగలంతా పొలంలో సాగు పనులు.. రాత్రి ప్రచారంతో బిజబీజీ
» విమర్శలు.. ప్రతి విమర్శలతో హీటెక్కుతున్న పల్లె రాజకీయం

ఆదిలాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు 3,870 వార్డులకు గాను మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇక ఎన్నికల బరిలో నిలవడం ఖాయమని తేలిపోవడంతో ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు స్థానిక ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థులు పోటాపోటీగా వారివారి ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేస్తూ దూసుకు పోతున్నారు. ఇంటింటి ప్రచారంతో పాటు వాల్ పోస్టర్స్, ప్రత్యేకంగా బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునే విధంగా ప్లాన్ చేస్తున్నారు. సర్పంచ్ పదవులతో పాటు వార్డు మెంబర్ పదవులకు తీవ్రమైన పోటీ కనిపిస్తుంది. ఈసారి యువకులే ఎక్కువగా పంచాయతీ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామ అభివృద్ధిని చేసి చూపుతామంటూ నమ్మబలుకుతున్నారు.

గుర్తులతో ఓటర్ల వద్దకు..

ఎన్నికల బరిలో నిలిచిన సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులతో ఓటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అభ్యర్థులకు ఉంగరం, కత్తెర, బ్యాట్, కప్పుసాసర్, గౌను, గ్యాస్ స్టవ్ ఇలా రకరకాల గుర్తులను కేటాయించారు. తమ గుర్తును గుర్తంచుకోవాలంటూ ఓటర్లకు పదేపదే సూచిస్తున్నారు. కొందరైతే డమ్మీ

(తరువాయి 6వ పేజీలో....)

పొద్దంతా పొలానికి.. రాత్రి ప్రచారం

పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు సాగు పనులతో పాటు ఎన్నికల ప్రచారంపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. పొద్దంతా పొలం బాట పడుతున్నా.. రాత్రివేళల్లో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం, రాత్రి వేళలోనే గ్రామాల్లో ఎన్నికల ప్రచారం సందడి కనిపిస్తుంది. కొందరైతే సాగు పనుల కోసం ప్రత్యేకంగా కూలీలను నియమించుకుంటున్నారు. వ్యవసాయ పనులు చేస్తునే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అటు సాగు పనులు ఇటు ఎన్నికల ప్రచారంతో బిజిబిజీగా మారిపోతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వరి కోతలు, పత్తి ఏరే పనులు కొనసాగుతున్నాయి. ఎన్నికల బిజీతో వ్యవసాయ పనులు వెనుకబడి పోతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అభ్యర్థులైతే వ్యవసాయ పనులను వదిలేసుకుంటూ ఎన్నికల పైనే ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. పంట దిగుబడులు చేతికి రావడంతో ఎన్నికలకు ఎలాంటి పైసల కొదవ లేదంటున్నారు. ఎన్నికల ఖర్చుల కోసం అభ్యర్థులకు అప్పులిచ్చేందుకు కొంతమంది రైతులు ముందుకు వస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఎన్నికల హడావిడి మొదలు కావడంతో విమర్శలు ప్రతీ విమర్శలతో పల్లె రాజకీయం హీటెక్కుతోంది.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

పకడ్బందీగా పంచాయతీ ఎన్నికలు

» స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ రాజర్షి షా వెల్లడి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో స్టేజ్-2 రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ మొదట విడత ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లోని స్టేజి-2 రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైందని, ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని అన్నారు. ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడంతో పాటు ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించి ఫలితాలు టీ-పోల్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత ప్రొఫార్మాల ప్రకారం పత్రాలను 3 కవర్‌లలో నింపి రెసెప్షన్ కేంద్రంలో అందజేసే బాధ్యత రిటర్నింగ్ అధికారులదేనని వివరించారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం, అభ్యర్థుల మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ నిబంధనల పరిశీలన, ఖర్చుల వివరాలు నమోదు, పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్, ఇతర సంబంధిత అంశాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత వారిదేదని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఉదయం 6 నుంచి ఒంటి గంట వరకు పోలింగ్

ఈనెల 10వ తేదీన పోలింగ్ కేంద్రానికి చేరుకుని 11వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించాలని, మధ్యాహ్నం 2 గంటల నుంచి వార్డుల వారీగా కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. చివరగా సర్పంచ్ ఎన్నిక అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని తెలిపారు. మొదటి విడతలో 32 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయని, అధికారులు ఈ ప్రకియ చేపట్టే అవసరం లేదన్నారు. మొదటి విడత గ్రామా పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి రేపటి నుంచి 8వరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఎన్నికల సాధరణ పరిశీలకుడు టి.వెంకన్న, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా శిక్షణ నోడల్ అధికారి మనోహర్, డీపీవో రమేష్, డీఎల్పీవో ఫణీందర్, తదితరులు, పాల్గొన్నారు.

వణుకు పుట్టిస్తున్న చలి..

» సాత్నాలలో 10.0 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత
» మారుమూల గ్రామాలను కమ్మేస్తున్న దట్టమైన పొగమంచు
» రైతులు, వృద్ధులు, చిన్నపిల్లలకు తప్పని తిప్పలు 6



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

'ముఖ్యమంత్రిని కలిస్తే తప్పేంటి?'

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని కలిస్తే తప్పేంటని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రశ్నించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి పనులు చేస్తుంటే చూసి ఓర్వలేని మాజీ మంత్రి జోగురామన్న అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్ పోర్ట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం ముఖ్యమంత్రిని కలిసి కోరితే దానిపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని, సీసీఐ పునరుద్ధరణ గురించి సైతం ఇదే రీతిన అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. నాయకులు రఘుపతి, జోగురవి, దినేష్ మటోలియా, భరత్, ధోని జ్యోతి, రాకేష్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు'

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గం సమస్యల సాధనే లక్ష్యంగా సీఐటీయూ అవిశ్రాంత పోరాటాలు చేస్తుందని యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ తెలిపారు. మెదక్‌లో ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర 5వ మహాసభల గోడ ప్రతులను శుక్రవారం నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సీఐటీయూ రాష్ట్ర మహాసభల వివరాలను వెల్లడించారు.

వణుకు పుట్టిస్తున్న చలి..

● సాత్నాలలో 10.0 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయి చలి తీవ్రత ప్రజలకు వణుకు పుట్టిస్తుంది. ఇప్పుడే చలి తీవ్రత ఇలా ఉంటే.. రాబోయే జనవరి మాసంలో ఎలా ఉండబోతుందోనని జనం బెంబేలెత్తి పోతున్నారు. గత పక్షం రోజులుగా జిల్లా వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగిపోయి రాత్రి వేళల్లో చలి తీవ్రత కనిపిస్తుంది. శుక్రవారం జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రత 28.0 డిగ్రీల సెల్సియస్ కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 11.5గా నమోదైంది. ఆదిలాబాద్ రూరల్ పిప్పల్‌ధరిలో 11.1, తలమడుగులో 11.2, బేల మండలం చప్రాలలో 11.7, మావల మండలంలో 11.8, గాదిగూడలో కారికెలో 12.0, తాంసిలో 12.3, ఇంద్రవెల్లిలో 12.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మారుమూల గిరిజన గ్రామాలను దట్టమైన పొగమంచు కప్పేస్తుంది. ఉదయం 9గంటల వరకు బయటకు వెళ్లేందుకే ప్రజలు భయపడుతున్నారు. సాయంత్రం 5వరకే పనులను ముగించుకుని ఇళ్లలోకి వెళ్లి పోతున్నారు. రాత్రీపగలు అనే తేడా లేకుండా వెచ్చని దుస్తులను ధరిస్తున్నారు. చలి తీవ్రతకు చలి మంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్నారు.



జిల్లాకేంద్రంలో కమ్ముకున్న పొగమంచు

ముగిసిన మూడో విడత నామినేషన్ల పర్వం

● చివరిరోజు పోటెత్తిన అభ్యర్థులు, భారీగా దాఖలైన నామినేషన్లు ● పలుచోట్ల నామినేషన్ కేంద్రాల పరిశీలన



నేరడిగొండలో వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర పరిశీలకుడు వెంకన్న



సోనాలలోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తూ..

నేరడిగొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారంతో ప్రశాంతంగా ముగిసింది. నామినేషన్ల దాఖలుకు చివరిరోజు కావడంతో, కార్యాలయాల వద్ద అభ్యర్థుల సందడి నెలకొంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు ఆశావహులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి తమ నామినేషన్లను దాఖలు చేశారు. మండలంలో మొత్తం 32 గ్రామ పంచాయతీలు ఉండగా, గత రెండు రోజులుగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే మొదటి రెండు రోజులతో పోలిస్తే, చివరి రోజున నామినేషన్ల సంఖ్య భారీగా పెరిగినట్లు ఎంపీడీవో శేఖర్ తెలిపారు. శుక్రవారం దాఖలైన నామినేషన్ల పూర్తి వివరాలు, మరియు స్క్రూట్నీకి సంబంధించిన సమాచారం తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు భారీగా తరలిరావడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

నేరడిగొండ: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు వెంకన్న సూచించారు. శుక్రవారం ఆయన నేరడిగొండ మండలంలో పర్యటించి స్థానిక ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండల కేంద్రంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వెంకన్న పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణపై అధికారులకు పలు కీలక సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన వెంట ఎంపీడీవో శేఖర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

బోథ్: మండల కేంద్రంతో పాటు కౌట(బి) గ్రామాలలో శుక్రవారం బోథ్ ఎంపీడీవో రమేష్ పరిశీలించడం జరిగింది. నామినేసన్ల ప్రక్రియ తొందర తొందరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. బూత్‌లోని నామినేషన్ సెంటర్‌లో వెబ్‌సట్‌లో ఆన్‌లన్ చేయాలని సూచించారు.

బోథ్: సోనాల మండల కేంద్రంతో పాటు బోథ్ మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాలను శుక్రవారం సాయంత్రం రాష్ట్ర సాధారణ ఎన్నికల పరిశీలకుడు టి.వెంకన్న సందర్శించారు. ఈ సందర్భంగా నామినేషన్లు పూర్తికాగానే అన్ని నామినేషన్లను ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీవోకు ఆయన ఈ సందర్భంగా సూచించారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు

నేరడిగొండ. డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బోథ్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి. బోథ్ మండల కేంద్రానికి చెందిన పలువురు హమాలి కూలీలు, యువకులు శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీలో సుమారు 50 మంది యువకులు స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు సస్యశ్యామలంగా మారాయన్నారు. ముఖ్యంగా రైతుల కోసం ప్రతీ గ్రామంలో రైతు వేదికలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని, అందుకే ప్రజలు స్వచ్ఛందంగా గులాబీ పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎలుక రాజు, సురేందర్ యాదవ్, సుభాష్, రఫీక్, రఫీ, రమణ గౌడ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'బాధిత కుటుంబానికి అండ'



నేరడిగొండ: బాధిత కుటుంబానికి అండగా ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద బుగ్గరం గ్రామానికి చెందిన జాదవ్ సీతాబాయి తెర్వి (పెద్దకర్మ) కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీతాబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, యువ నాయకులు రాథోడ్ సురేందర్, కృష్ణ నాయక్, నక్షు, ధనరాజ్, దేవులాల్, పవన్, నారాయణ, సురేందర్, భీంరావ్, పాండు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ (ఇన్‌సెట్‌లో జాదవ్ సీతాబాయికి నివాళ్లర్పిస్తూ..)

(5వ పేజీ తరువాయి...)

పల్లెల్లో.. ప్రచార సందడి

గుర్తులతో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నా రు. చివరి సమయంలో గుర్తులను ఓటర్లకు ఉచితంగా పంపిణీ చేసే విధంగా ప్లాన్ చేసుకుంటున్నారు. భారీ మొత్తంలో కొనుగోలు చేస్తూ డంప్ చేసుకుంటున్నారు. డమ్మీ బ్యాలెట్ పత్రాలను ముద్రించి ఓటర్లకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. రెండవ విడతకు సంబంధించిన గుర్తులను శనివారం కేటాయించనున్నారు.పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో అన్ని గ్రామాల్లో సందడి వాతావరణమే కనిపిస్తుంది.

గంప గుత్తా ఓట్లే టార్గెట్

కుల సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్న అభ్యర్థులు వారి మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా గంపగుత్తగా ఓట్లను రాబట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. కుల సంఘాల వారీగా సమావేశాలను నిర్వహిస్తూ వారికి అవసరమైన ఆఫర్ చేస్తున్నారు. మందు విందు దావతులతో హల్చల్ చేస్తున్నారు. కుల సంఘాలకు అవసరమన వంట పాత్రలు, టెంటు సామగ్రి ఇతర పరికరాలను కొనిస్తామంటూ హామీలు ఇస్తున్నారు. అలాగే కొన్నిచోట్ల సంఘ భవనాలు, ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ఒప్పంద పత్రాలు రాసుకుంటున్నారు. గంపగుత్తగా వచ్చే ఓట్లను టార్గెట్ చేస్తూ దేనికైనా రెడీ అంటూ నమ్మబలుకుతున్నా రు. అయితే అందరికీ ఒకే అంటున్నా ఓటర్లు ఎవరికి మద్దతుగా నిలుస్తారో? అర్థం కాని పరిస్థితులు ఉన్నాయంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

రెండేళ్ల కాలంలోనే ఎంతో అభివృద్ధి

● ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండేళ్ల కాలంలోనే ఎంతో చేసి చూపించిందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేకనే బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. సీఎం సభ విజయవంతమైందని, పెద్ద సంఖ్యలో జనం స్వచ్ఛందంగా తరలి వచ్చారన్నారు. సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, లోక ప్రవీణ్ రెడ్డి, ఎంఏ షకీల్, మినుకు నారాయణ రెడ్డి, దాసరి ఆశన్న పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు.. అప్రజాస్వామికం

● తక్షణమే విడుదల చేయాలి : భుజంగ్‌రావు

ఉట్నూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వెళ్లిన విద్యార్థులను అక్రమంగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని,వారిని వెంటనే విడుదల చేయాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఆత్రం భుజంగ్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ పై నిజ నిర్ధారణ చేసేందుకు శుక్రవారం ఉదయం బయల్దేరిన వివిధ విశ్వ విద్యాలయాల విద్యార్థి నాయకులను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా నిర్బంధించడం గంభీరమైన ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని మానవ హక్కుల వేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.14 మంది విద్యార్థులను అరెస్టు చేసి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసు స్టేషన్‌లో నిర్బంధించినట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. అరెస్టు చేసిన విద్యార్థులను బేషరతుగా వెంటనే విడుదల చేసి వారికి నిజ నిర్ధారణ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



తరోడాలో నామినేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎల్పీవో

నామినేషన్ల కేంద్రాల పరిశీలన

ముథోల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముథోల్ మండలంలోని తరోడా, ఎడ్‌బిడ్ నామినేషన్ కేంద్రాలను శుక్రవారం డీఎల్పీవో లక్ష్మణ్ పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించి, ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలను అందించారు. నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియ కొనసాగించాలని పేర్కొన్నారు. ఆయనవెంట ఎంపీడీవో లవ కుమార్, ఎంపీవో శివ కుమార్, సూపరింటెండెంట్ అశోక్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలి



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

భైంసారూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోతుల్‌గాం గ్రామంలోని నామినేషన్ కేంద్రాన్ని ఎంపీడీవో నీరజ్ పరిశీలించారు. రెండో విడత నామినేషన్ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మూడో విడత ఎన్నికల సర్పంచ్‌లు, వార్డుమెంబర్ల నామినేషన్ ప్రక్రియ శుక్రవారంతో ముసినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద ఎలాంటి అసంఘటిత చర్యలు జరగకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ



భైంసాలో జాతీయ రహదారిపై విక్రయిస్తున్న ఉన్ని దుస్తులు

భైంసా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చలిగాలుల తీవ్రమవుతున్న నేపథ్యంలో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది. ప్రతీయేటా చలి కాలంలో జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో రోడ్డు మార్గాల్లో ఉన్ని దుస్తుల విక్రయ కేంద్రాలు వెలుస్తుంటాయి. ఈయేడు కూడా నేపాల్ దేశస్తులతోపాటు ఇతర ప్రాంతాలవాసులు జిల్లాలో ఉన్ని దుస్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే గత పక్షం రోజులుగా అంతంత మాత్రంగానే గిరాకీ ఉండటంతో సంబంధిత విక్రయ కేంద్రాలో కొనుగోళ్లు లేక వెలవెలబోయి కనిపించాయి. ఈ క్రమంలో నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో ఉన్నిదుస్తుల విక్రయ కేంద్రాలు కొనుగోలు దారులతో కళకళలాడుతున్నాయి. స్వెటర్లు, మంకీ క్యాపులు, శాలువాలు, చేతిగ్లౌజులు, జర్కిన్లు, రగ్గులు, మఫ్లర్ల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రధాన రహదారి మార్గాలతోపాటు జాతీయ రహదారి మార్గాల్లో విక్రయాలు అధికంగా జరుగుతున్నాయి.

నామినేషన్ కేంద్రాల వద్ద సందడి

» బలప్రదర్శనకు దిగిన అభ్యర్థులు
» మద్దతుదారులతో ర్యాలీలు



ముథోల్ నామినేషన్ కేంద్రం వద్ద నెలకొన్న సందడి

భైంసా, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో శుక్రవారం చివరి విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. బుధవారం ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ మూడురోజులపాటు కొనసాగింది. చివరిరోజైన శుక్రవారం నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన క్లస్టర్ కేంద్రాల్లో సందడిగా మారాయి. అన్ని ప్రాంతాల్లోని క్లస్టర్ కేంద్రాల వద్ద నామినేషన్ల దాఖలు కోసం అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. రెండురోజుల పాటు అంతంత మాత్రంగానే నామినేషన్లు దాఖలు అవ్వగా చివరిరోజు మాత్రం అధిక మొత్తంలో దాఖలయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ పలు క్లస్టర్ కేంద్రాల్లో రాత్రి వరకు కొనసాగాయి.

ర్యాలీగా తరలివచ్చి నామినేషన్లు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచు అభ్యర్థులతో పాటు వార్డు అభ్యర్థులు సైతం నామినేషన్ల ప్రక్రియను అట్టహాసంగా నిర్వహించారు. తమ తమ గ్రామ పంచాయతీల నుంచి క్లస్టర్ కేంద్రాలు ర్యాలీగా తరలివచ్చి నామినేషన్లను దాఖాలు చేశారు. గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు, మసీదులు, దర్గాలు, చర్చిల వద్ద ప్రార్థనలు, జాతీయ నాయకుల విగ్రహాలతోపాటు బీఆర్ అంబేద్కర్, అన్నబాహు సాటే, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నామినేషన్ల కోసం తరలివెళ్లారు. తమ ఇళ్లలో తల్లితండ్రులకు, పెద్దల పాదాలకు పూజలు చేసి అనుచరగణం, మద్దతుదారులు, బంధు,మిత్రులు, పార్టీ శ్రేణులతో కలిసి బ్యాండ్ మేళాలతో బల ప్రదర్శన నిర్వహించుకుంటూ నామినేషన్లను దాఖలు చేశారు. ఒక అభ్యర్థిని మించి మరో అభ్యర్థి పోటాపోటీగా పైచేయి నిలుపుకునేలా నామినేషన్లు వేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు

భద్రతా చర్యలు కట్టుదిట్టం

» భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా

భైంసా, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక కేంద్రమైన భైంసాలో శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ భద్రతా చర్యలు చేపడుతామని ఏఎస్పీ రాజేష్ మీనా పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని పలు ప్రధాన, సమస్యాత్మక, వివాదాస్పద ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని స్థితి,గతులు, రద్దీ ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ పరిస్థితులను పర్యవేక్షించారు. అనంతరం భైంసా టౌన్ పోలీసు స్టేషన్‌లో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేరాల నియంత్రణకు అనుసరించాల్సిన పలు విధానాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పట్టణ పరిధిలో భద్రతా చర్యలను మరింత పటిష్టవంతంగా తీర్చిదిద్దేందుకు గాను అనుసరించాల్సిన చర్యలపై మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లోని పోలిస్ పికెట్లు, సీసీ కెమెరాల పనితీరు, కమాండ్ కంట్రోల్ రూమ్ తదితర విషయాలపై చర్చించారు. పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని వేళల అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించవద్దని సూచించారు. పట్టణ పరిధిలో ప్రశాంత వాతవరణం కొనసాగేందుకు సహకరించాలని కోరారు. ఇందులో భైంసా రూరల్ సీఐ నైలు, టౌన్ ఎస్ఐలు జుబేర్,సుప్రియలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా



భైంసాలోని ప్రధాన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ



డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

ముగిసిన సంప్రదాయ కళా సమ్మేళనం

» ఆర్జీయూకేటీలో స్పిక్‌మేకే 4వ రాష్ట్ర సమ్మేళనం ముగింపు

బాసర, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సాంప్రదాయ కళల వైభవాన్ని యువతకు పరిచయం చేసే లక్ష్యంతో ఏర్పాటైన స్పిక్ మేకే 4వ రాష్ట్ర సమ్మేళనం ఆర్జీయూకేటీ బాసరలో మూడు రోజుల నుంచి కొనసాగుతున్న కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సమ్మేళనంలో యోగా, సంగీతం నృత్యం, కథన కళ, చిత్రకళ, జానపద సంప్రదాయాలు, శిల్పకళ వంటి అనేక కళా రంగాలను ఒకే వేదికపై సమన్వయ పరిచి విద్యార్థులకు అరుదైన, స్ఫూర్తిదాయకమైన అవగాహన అందించింది. మూడురోజులు జరిగిన ఇంటెన్సివ్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రదర్శనలు యోగా, సంగీతం, నృత్యం, కథనకళ, ఫైన్‌ఆర్ట్స్ రంగాల్లో వారు పొందిన అపారమైన నైపుణ్యాలను అద్భుతంగా ఆవిష్కరించాయి. ఈ సమ్మేళనం విజయవంతం కావడం పట్ల స్పిక్ మేకే వ్యవస్థాపకుడు పద్మశ్రీ డా.కిరణ్‌సేత్, రాష్ట్ర కన్వీనర్ డా.టి.రాకేష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



చివరిరోజు సాంస్కృతిక ప్రదర్శిస్తున్న కళాకారులు



అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్పీ

భైంసా రూరల్ పీఎస్ తనిఖీ

భైంసారూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భైంసా రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఏఎస్పీ రాజేష్ మీనా శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణను, రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్‌లో ఉంచకూడదని, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. తగు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం మీర్జాపూర్ గ్రామంలోని ఎలక్షన్ నామినేషన్ సెంటర్‌ను సందర్శించి ఎటువంటి ఆటంకాలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. ప్రతీ కేసును క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట భైంసా రూరల్ సీఐ ఎం. నైలు, వంకర్, ఎస్సై, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బరిలో 'బంధాలు'

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని కామగిరి సర్పంచ్ పదవికి అత్తాకోడళ్లు పోటీపడు తున్నారు. అత్తా గోపిడి అనురాధ, కోడలు నిమ్మల సుప్రియ ఇద్దరే బరిలో ఉండటం విశేషం. ఆ గ్రామపంచాయతీ ఓటర్లు ఏవరిని గెలిపిస్తారో చూడాలి. ఈ విషయమై గ్రామస్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

లింగాపూర్‌లో తోటికోడళ్ల పోటీ..

నిజామాబాద్ జిల్లాల్లోని నవీపేట మండలంలోని లింగాపూర్‌లో సర్పంచ్ పదవికి తోటి కోడళ్లు పోటీ పడుతున్నారు. సర్పంచ్ పదవి బీసీ మహిళకు కేటాయించగా కోరే లావణ్య, మాడబోయి నిత్యశ్రీ, దూడల శ్యామల, దూడల మంజుల అనే నలుగురు మహిళలు సర్పంచ్ పదవికి నామినేషన్‌లు దాఖలు చేసి పోటీలో నిలిచారు. ఇందులో దూడల శ్యామల, దూడల మంజుల తోటి కోడళ్లు.




అత్తా అనురాధ, కోడలు సుప్రియ

గుండారంలో అన్నదమ్ముల సవాల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం మేజర్‌గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి సొంత అన్నదమ్ములు పోటీపడుతున్నారు. అంకల గంగాధర్ ఒకసారి ఎంపీటీసీ, ఆయన భార్య అంకల సవిత ఒకసారి ఎంపీటీసీగా గెలిచారు. ఉపాధికోసం ఇజ్రాయిల్ దేశానికి వెళ్లి అక్కడే 20 సంవత్సరాలు పనిచేశారు. సర్పంచ్ ఎన్నికలు వస్తున్నాయని తెలిసి ఇజ్రాయిల్ నుంచి గుండారం వచ్చారు.

ప్రచారమంతా సోషల్‌మీడియాలోనే...

గ్రామ పంచాయతీల ఎన్నికల ఘట్టం మొదలు వారం రోజులు కావస్తున్నా ఎన్నికల ప్రచారంలో ఇంకా స్తబ్ధత కనిపిస్తుంది. ఏజెన్సీ ప్రాంతాల పల్లెపోరులో పోటాపోటీగా నామినేషన్లు వేసిన అభ్యర్థులు ఉపసంహరణలు ముగిసి ఎన్నికల గుర్తులు చేతికి వచ్చినప్పటికీ ఇంకా ప్రచారంపై దృష్టి కేంద్రీకరించ లేదు. మండలంలోని ఓపెన్ గ్రామ పంచాయతీలలో ఏడు పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నిక గా 31 పంచాయతీలకు బహుముఖ పోటీ నెలకొంది. గ్రామాలలో చదువుకున్న వారిని ఆశ్రయించి సామాజిక మాధ్యమాల ద్వారా గ్రూపులలో గ్రామీణులను ఓట్లు అడుగుతున్నారు. గ్రామాలలో ఎన్నికల ప్రచారం అంతగా కనిపించడం లేదు. ఉట్నూర్ మేజర్ పంచాయతీ 15 మంది పోటీ పడుతుండగా లక్కారంలో ఏడుగురు, మత్తడిగూడలో ముగ్గురు, గన్‌పూర్‌లో ఐదుగురు, దొంగ చింతలు నలుగురు, కన్నాపూర్‌లో ముగ్గురు, ఉమ్రిలో ముగ్గురు, నరసాపూర్ బీలో నలుగురు, లద్దంగూడలో ముగ్గురు, ఏందాలో నలుగురు, కుమ్మరితండాలో నలుగురు, జైత్రంతండాలో ఆరుగురు, షాపూర్‌లో ఐదుగురు, నాగాపూర్‌లో ఇద్దరు, లింగోజితండాలో ముగ్గురు, లక్షెటిపేటలో ఇద్దరు, పులిమడుగులో ముగ్గురు, సాకెర జెలో ఐదుగురు, వడగల్‌పూర్ కెలో ఇద్దరు బరిలో ఉన్నారు.





నర్సాపూర్(బి) గ్రామం

- ఉట్నూర్, ఆంధ్రజ్యోతి

నోటా గెలిస్తే?



నోటాకు అందరికన్నా ఎక్కువ ఓట్లు పడితే.. రెండో స్థానంలో ఉన్న అభ్యర్థే విజేత

పంచాయతీ ఎన్నికల్లో ఈసారి ఎన్నికల సంఘం నోటాను ప్రవేశపెట్టింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నోటా మీట నొక్కొచ్చు. మరి బరిలో నిలిచిన అభ్యర్థుల కన్నా ఎక్కువ ఓట్లు నోటాకు వచ్చినా ఎన్నిక రద్దయ్యే అవకాశం లేదు. ప్రస్తుత ఎన్నికల నిబంధనల ప్రకారం నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చినా.. రెండోస్థానంలో ఉన్న అభ్యర్థినే విజేతగా ప్రకటిస్తారు. నోటాకు అత్యధికంగా ఓట్లు వస్తే ఆ ఎన్నిక ఫలితాన్ని రద్దు చేసి మళ్లీ పోలింగ్ నిర్వహించాలని గతంలో సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలయింది. నోటా కన్నా తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థులను తదుపరి ఐదేళ్ల పాటు అన్ని ఎన్నికల్లో పోటీచేయకుండా చూసేలా నిబంధనలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిశీలించిన కోర్టు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. అయినా ఇప్పటివరకు సదరు అంశాలపై ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

- ఇచ్చోడ, ఆంధ్రజ్యోతి

చీకటి చెదిరే సంకల్పం..

- రాత్రి వరకూ కొనసాగిన నామినేషన్ల స్వీకరణ
- తలమడుగులో 120 దరఖాస్తులు
- చలిలోనూ బారులు తీరిన అభ్యర్థులు



గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల నామినేషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ అధికారి



తలమడుగులో నామినేషన్ కేంద్రాలు పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్

తలమడుగు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎముకలు కొరికే చలిలోనూ ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో గ్రామపంచాయతీ సర్పంచులకు పోటీ చేసేందుకు అభ్యర్థులు జోరుగా దరఖాస్తులు చేసుకున్నారు. శుక్రవారం చివరి రోజు కావడంతో రాత్రి వరకూ నామినేషన్ కేంద్రాల్లో బారులు తీరారు. తలమడుగు మండలంలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఆయా పార్టీల నాయకులు బలపరిచిన అభ్యర్థులు జోరుగా దరఖాస్తులు చేసుకున్నారు. తలమడుగు మండలంలో 29 గ్రామ పంచాయతీలగాను దాదాపు 120 దరఖాస్తులు వచ్చాయని, ఇంకా కొన్ని క్లస్టర్‌ల నుంచి నుంచి వచ్చేవి ఉన్నాయని ఎన్నికల అధికారి ఎంపీడీవో శంకర్ తెలిపారు. అదేవిధంగా 250 వార్డు మెంబర్ల కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంకా కొన్ని కేంద్రాల నుంచి దరఖాస్తులు వచ్చేవి ఉన్నాయని ఎన్నికల అధికారి తెలిపారు. కాగా మండలంలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ సర్పంచుల దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ వెంకన్న జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ ఇతర ఎన్నికల అధికారులు నామినేషన్ కేంద్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. అదేవిధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పది పంచాయతీలు ఏకగ్రీవం

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో 29 గ్రామ పంచాయితీలో గాను దాదాపు పదికిపైగా ఏకగ్రీవంగా గ్రామ పంచాయతీలు ఎన్నికైనట్లు సమాచారం. శుక్రవారం రాత్రి వరకు నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల్లో 29 గ్రామ పంచాయతీలకు గాను దాదాపు 10 గ్రామ పంచాయితీలో ఒక్కొక్క అభ్యర్థి సర్పంచ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా వార్డు మెంబర్ కోసం కూడా ఒక్కొక్క నామినేషన్ వచ్చాయి. అర్లికే బరంపూర్, డోర్లి, కోసాయి, లక్ష్మంపూర్, నందిగామ, పల్సి (బి), పల్సి (బి) తండా, రత్నపూర్, ఉమ్రి తదితర గ్రామ పంచాయితీలో సర్పంచ్ కోసం ఒక్కొక్క పోటీ చేసేందుకు ఒక్కొక్క దరఖాస్తులు రావడంతో దాదాపు ఏకగ్రీవంగా అయినట్లు సమాచారం. విత్‌డ్రా తరువాత మరికొన్ని గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.



అదిమ్యాన్ సర్పంచ్ కొరెంగా శ్రీదేవి



ఇండో సర్పంచ్ కుమ్ర బాగుబాయి

నాలుగు పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవం



రాంపూర్ సర్పంచ్ కుమ్ర జంగు



కునికసా(జీ)లో కొడప

నార్నూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గాదిగూడ మండలంలోని నాలుగు పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాలను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తీర్మానించారు. అదిమ్యాన్ గ్రామానికి కొరెంగా శ్రీదేవి, ఇండో గ్రామానికి కుమ్ర బాగుబాయి, కునికసా(జీ) గ్రామానికి కోడప దుర్గు, రాంపూర్ గ్రామానికి హెర కుమ్ర జంగును ఎన్నుకుంటూ తీర్మానించారు.

రాజురా పంచాయతీ ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రాజురా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆదర్శంగా నిలిచింది. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ స్వగ్రామమైన రాజురాలో, గ్రామస్తులంతా ఐకమత్యంతో వ్యవహరించి సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలాంటి పోటీలేకుండా గ్రామ పెద్దల సమక్షంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకోవడం పట్ల ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఆయన శాలువాతో సత్కరించారు. గ్రామాభివృద్ధికి అంతా కలిసికట్టుగా కృషిచేయాలని కోరుతూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పాలకవర్గం సర్పంచ్ జాదవ్ సోరాజి, ఉపసర్పంచ్ రాథోడ్ బాపురావులతో పాటు సభ్యులను సన్మానించారు.

దివ్యాంగుల జీవితాల్లో ధైర్యం నింపాలి

సిరికొండ, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల విద్యార్థులకు మనం చూపాల్సింది దయ కాదు.. ధైర్యంతో పాటు.. భరోసానివ్వాలని జిల్లా సెక్టోరియల్ అధికారి తిరుపతి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పీఎం శ్రీ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల సిరికొండలో దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సెక్టోరియల్ అధికారి యూ.తిరుపతి పాల్గొని ప్రసంగించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రోత్సహిస్తే స్వశక్తితో ఎదుగుతారని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమగ్ర శిక్ష అభియాన్ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించారు. మనమందరం వారికి తోడుగా ఉండి. వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు గడుగు మహేందర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలలో నిగూఢంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం ద్వారా వారు స్వశక్తితో ఎదిగి, వారి తల్లిదండ్రులకు భారం కాకుండా దేశ సమగ్ర అభివృద్ధిలో భాగం అవుతారని అన్నారు. అదేవిధంగా వారికున్న హక్కుల గురించి, ఆర్పీడబ్లు యాక్ట్ గురించి, ఐఈఆర్పి సురేష్ వివరించారు. అనంతరం ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమేష్, ఉపాధ్యాయులు ప్రవళిక, మానస, కళ్యాణి, ప్రత్యూష, సంతోష్, విద్యార్థులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు

ముగిసిన లీడ్ ఇండియా శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న శ్రీనివాస ఆచార్య

ముథోల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు విద్యార్థులకు జరుగుతున్న శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. డాక్టర్ అబ్దుల్ కలాం, సుదర్శనచార్యులు స్థాపించిన లీడ్ ఇండియా ఫౌండేషన్ కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన శిక్షణ ముగిసింది. కార్యక్రమాన్ని నిర్వహించిన లీడ్ ఇండియా స్టేట్ ట్రైనింగ్ మేనేజర్ శ్రీనివాస ఆచార్య మాట్లాడుతూ... విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, సంస్కారం, తల్లిదండ్రులు, గురువుల పట్ల ఎలాంటి భక్తిభావనలు కలిగి ఉండాలని, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఎలా ప్రయత్నించాలనే విషయాలను విపులంగా వివరించారు. 2047 వరకు సాంకేతికంగా దేశాన్ని విశ్వగురు భారత్‌గా నిలబెట్టాలన్న అబ్దుల్ కలాం ఆశయాలను నెరవేర్చాలన్నారు. తదుపరి పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ మాట్లాడుతూ... విద్యార్థుల పరివర్తన వికాసానికి కృషి చేస్తూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, ఆశయ సాధనకు కావలసిన సామర్థ్యాలను, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించేందుకు కృషి చేస్తూ తమ పాఠశాలలో ఇలాంటి ఉన్నతమైన కార్యక్రమాన్ని నిర్వహించిన లీడ్ ఇండియా ట్రైనర్లకు ధన్యవాదాలు అన్నారు. అతిథులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లీడ్ ఇండియా ట్రైనర్ పి.విజయ్‌కుమార్, ఎం.చిరంజీవి, వివేకానంద, పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ్, కరస్పాండెంట్ రాజారెడ్డి, ప్రముఖకవి పి.శ్రీనివాస్‌గౌడ్, రబీంద్ర పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జైనథ్‌లో గ్రామ సంఘాల ఆడిట్



జైనథ్ ఐకేపీ కార్యాలయంలో వీవోల ఆడిట్‌లను నిర్వహిస్తున్న సీబీఓ ఆడిటర్లు

జైనథ్, డిసెంబర్5 (ఆంధ్రజ్యోతి): జైనత్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం ఇందిరమ్మ మండల సమాఖ్య పరిధిలోని గ్రామ సంఘాల ఆడిట్‌లను నిర్వహించినట్లు ఏపీఎం సుజాత తెలిపారు. 2024-25కు సంబంధిత సంఘాల ఆర్థిక లావాదేవీలపై అంతర్గత ఆడిట్‌లను చేపట్టినట్లు తెలిపారు. ఇందులో నగదు పుస్తకము, సాధారణ లెడ్జరు, సమావేశ పుస్తకం రసీదు, ఓచర్, చెక్‌ఇష్యు, రిజిస్టరు లాంటి పుస్తకాలను ఆడిటింగ్, ఈ ఆడిట్‌లో సీబీఓ ఆడిటర్లు శ్రీనివాస్, రాజేందర్, గంగాధర్, సీసీలు, టి.శ్రీనివాస్‌రెడ్డి, హేమలత, నాగమణి, వీఓఏలు, అకౌంటెంట్ లక్ష్మి తదితరులున్నారు.

నేరడిగొండ పీహెచ్‌సీలో ఎల్వీ ప్రసాద్ కంటి పరీక్షల శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

నేరడిగొండ, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వారి సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం వైద్యాధికారి డాక్టర్ సద్దాం పర్యవేక్షణలో జరిగింది. గ్రామీణ ప్రజలు కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైద్యులు సూచించారు. శిబిరంలో హెల్త్‌సూపర్‌వైజర్లు ఏ.సంతోష్, బి.స్వర్ణలత పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎల్వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. బృందంలో లలిత, వర్షిక, లక్ష్మి, సిహెచ్. శివకుమార్, అంజలి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడానికి స్థానిక ప్రజలు తరలివచ్చారు.

నేటి నుంచి మల్లికార్జున స్వామి ఉత్సవాలు

నర్సాపూర్(జి), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) మండల కేంద్రానికి మూడుకిలోమీటర్ల దూరంలో అడవిలో వెలసిన పుణ్యక్షేత్రంలో ఉత్సవాలు శనివారం ఉదయం ప్రారంభమై సోమవారం ముగియనున్నాయి. మూడురోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది. ఉదయం 8 గంటల కు పుణ్యాహవాచనం, 9 గంటలకు మూలవిరాట్‌కు అభిషేకం, అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపు, మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణం, మధ్యా హ్నం 2 గంటల తరువాత అన్నప్రసాదం ఉంటుంది.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/s Shriram Finance Ltd, Branch: Nirmal has agreed to accord Loan to Smt. Guddeti Sujatha W/o Ravi, Occ: household, R/o H.No. 1-62, Penchikal pad village, R/M Kuntala, Dist. Nirmal (Co-Borrower/property holder) by mortgage of the schedule referred property. The above prospective Loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within (07) days of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.
Hence this notice

SCHEDULE PROPERTY

The open plot No. 16/1 in Sy.No. 159/అ1 & 159/ఆ1, admeasuring 717.5 Sq. feet = 79.72 Sq. yards situated at Bhainsa, under limits of Municipality, Bhainsa, Dist. Nirmal

Boundaries:
East : Plot No. 17/1, **West:** 20' wide road,
North : Others plots, **South :** Plot No. 16

J. KRISHNA MOHAN RAO
MA.LLB., Advocate
Shriyam "Sai", H.No.1-3-458, Road No.2
Shastrinagar South, Nirmal (Dist.)
Pin: 504106 Cell: 9959298938

రైతుల సమస్యలపై నిరంతర పోరాటం



బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ

తాంసి, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరా టం చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని జామిడి, బండల నాగపూర్ గ్రామాలలో మృతిచెందిన రైతు కుటుంబాలను ఆయన పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ రానున్న రబీలో పండించే పంటలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరారు. జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుగుండె నిబ్బరంతో వ్యవసాయంలో రాణించాలన్నారు. ముఖ్యంగా రైతు సమస్యలపై ఎంతటి పోరాటానికైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా రైతు కుటుంబాలను ఆయన ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ విజయ డైరీ రాష్ట్ర అధ్యక్షులు లోక భూమారెడ్డి, మాజీ జడ్పిటిసి రాజు తదితరులు ఉన్నారు.

కైలాస్‌టేకిడి ఆలయం వద్ద జాతర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బోథ్, డిసెంబర్5 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని మహారాష్ట్ర అటవీ సరిహద్దుల్లో ఉన్న కైలాస్‌టేకిడి శివాలయంలో శుక్రవారం జాతర ప్రారంభమైంది. జాతరకు పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా లింబాజి మహరాజ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కలశపూజ చేశారు. దీంతో జాతర ప్రారంభం అయింది.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న లింబాజి

బీంపూర్, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం బీంపూర్ తాజా మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు మాడవి లింబాజి తన అనుచరులు కలిసి శుక్రవారం మాజీ ఎంపీ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోయం బాపు రావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లింబాజి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మచైర్మన్ కామన్ అశోక్, మాజీ సర్పంచ్ పెండ్యపు కృష్ణ, ఆదివాసి నాయకులు మారప భారత్, అన్ను పటేల్, దనస్ జై తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల సామాగ్రిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జడ్పీ సీఈవో

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

» ఇన్‌చార్జి జడ్పీ సీఈవో శంకర్

దస్తురాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి జడ్పీ సీఈవో శంకర్ సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా సాగేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కార్యచరణలో ఏ దశలోనూ నిర్లక్ష్యంగా చోటుచేసుకోకూడదన్నారు. ప్రతీ అధికారికి అప్పగించిన బాధ్యతలను సమయపాలనతో నిర్వహించాలని తెలిపారు. ఓటర్ల సౌకర్యాలు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, రవాణా, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాల్లో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని శంకర్ ఆదేశించారు. ప్రజలు భయంలేకుండా ఓటుహక్కును వినియోగించుకునేలా అన్నిశాఖలు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో అరుణ, ఎంపీవో రమేష్‌రెడ్డి ఉన్నారు.



గెలుపే టార్గెట్

గెలుపే టార్గెట్‌గా ప్రధాన పార్టీల నేతలు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. గ్రామ పంచాయతీల ఎన్నికలను అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండడంతో ఈ ఎన్నికలు ఆసక్తిగా మారుతున్నాయి. పార్టీరహిత ఎన్నికలు అయినా పరోక్షంగా ప్రధాన పార్టీల మద్దతుదారులే పోటీ పడుతున్నారు.

- రంగంలోకి పార్టీ పెద్దలు
- మద్దతుదారుల గెలుపు కోసం వ్యూహ ప్రతివ్యూహాలు
- సీఎం పర్యటనలతో కాంగ్రెస్‌లో జోష్
- గత ఎన్నికల ఊపునే కొన సాగించేందుకు బీజేపీ ప్రయత్నాలు
- ఉనికి కోసం పోటీలో బీఆర్ఎస్
- రవసత్తరంగా పల్లెపోరు
- పల్లెల్లో ఓట్ల సందడి

నిర్మల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 400 గ్రామ పంచాయతీలకు గానూ ఒక్క పెర్కపల్లి గ్రామపంచాయతీ మినహా 399 గ్రామ పంచాయతీల్లో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే మొదటి, రెండో దశ నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడం, మూడోదశకు సంబంధించిన ప్రక్రియ సైతం మొదలుకావడంతో ఇక పల్లెల్లో ఓట్ల సందడి విస్తరిస్తోంది. ఈ క్రమంలోనే మూడు పార్టీల నాయకులు తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు రోజుకో వ్యూహంతో ముందుకు సాగుతున్నారు.

సవాలుగా తీసుకున్న కాంగ్రెస్

ముఖ్యంగా అధికార కాంగ్రెస్‌పార్టీ ఈగ్రామ పంచాయతీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండడంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. ఇటీవలే డీసీసీ అధ్యక్షుడిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు బాధ్యతలు స్వీకరించడం, ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించడం లాంటి పరిణామాలు కాంగ్రెస్‌కు సవాలుగా నిలుస్తున్నాయి. ఈఎన్నికల్లో భారీసంఖ్యలో గ్రామపంచాయతీలను గెలుచుకొని తన సత్తాను చాటుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. పార్టీ మండల, గ్రామస్థాయి నాయకులకు ఆయా గ్రామ పంచాయతీల గెలుపుబాధ్యతలను అప్పగించడమే కాకుండా వారికి దన్నుగా నిలుస్తున్నారు.



ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న ఇతర పార్టీల నాయకులు

సీఎం పర్యటనతో జోష్

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ప్రభావం నిర్మల్ జిల్లాలో జరిగే పంచాయతీ ఎన్నికలపై ఉంటుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెడ్మబొజ్జు జిల్లాలోని సీనియర్ నాయకులందరితో చర్చలు మొదలుపెట్టారు. గ్రామ పంచాయతీల్లో భారీ మెజార్టీని దక్కించుకోవాలని, అందుకు నేతలంతా సమిష్టిగా కృషిచేయాలని బొజ్జు పార్టీ సీనియర్ నేతలందరిని కోరారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాలకు చెందిన నేతలంతా తమ పరిధిలోని మండలాల్లో అన్ని గ్రామ పంచాయతీలను దక్కించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. పలువురి నామినేషన్లను ఉపసంహరణ చేయించారు. దీంతో జిల్లాలో 16 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా అందులో ఏడేనిమిదికి పైగా కాంగ్రెస్ మద్దతుదారులే పదవులు దక్కించుకున్నారు. ముథోల్‌లో మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డిలతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ తదితరులు తమ నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దించుతున్నారు. నిర్మల్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావులు కూడా తమ పరిధిలోని మండలాల్లో పార్టీ మద్దతుదారుల గెలుపు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఈసారి బలంగానే బీజేపీ

మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో చాలాచోట్ల మెజార్టీ ఓట్లను దక్కించుకున్న బీజేపీ ఈసారికూడా అదేఊపును కొనసాగించాలని ప్రయత్నిస్తోంది. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్‌లు తమ నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీల్లో గెలుపే లక్ష్యంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే మహేశ్వర్‌రెడ్డి నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామపంచాయతీల ముఖ్యనేతలతో చర్చిస్తూ గెలుపు కోసం పావులు కదుపుతున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి నిర్మల్‌లోనే ఉంటూ అభ్యర్థుల ఎంపిక విషయంలో కూడా ఆయన తగిన జాగ్రత్తలు తీసుకుంటూ గట్టి పోటీనిచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ముథోల్‌లో కూడా రామారావు పటేల్ మెజార్టీ గ్రామ పంచాయతీలను దక్కించుకునేందు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉనికి కోసం బీఆర్ఎస్

గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ కూడా ఈసారి గట్టి పోటీనిచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ నేతలు బలమైన అభ్యర్థులను బరిలోకి దింపే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఖానాపూర్‌లో ఆ పార్టీ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్, బీజేపీలకు చెక్‌పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ముథోల్‌లో ఆ పార్టీ నేతలు కిరణ్ కొమురేవార్, రమాదేవి, విలాస్ గాదేవార్‌తో పాటు మరికొందరు కూడా గట్టి పోటీనిచ్చేందుకు తమ పార్టీ తరపున బలమైన అభ్యర్థులను రంగంలోకి దించుతున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో మాత్రం కొన్ని గ్రామాల్లోనే ఆ పార్టీ ప్రభావం చూపించే అవకాశాలుండగా మిగతా గ్రామాలపై కనీస పట్టు సాధించేందుకు నేతలు ప్రయత్నిస్తున్నారు.

ముగిసిన మూడో విడత నామినేషన్ల ప్రక్రియ

» సర్పంచ్‌కు 74, వార్డులకు 337 నామినేషన్లు

ముథోల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడత నామినేషన్ల ప్రక్రియ ముథోల్ మండలంలో శుక్రవారం ముగిసింది. మండల పరిధిలోని 19 గ్రామపంచాయతీలకు గాను సర్పంచ్‌కు 74మంది అభ్యర్థులు, 166 వార్డులకు గాను 337 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

సీసీఎస్ ఉద్యోగులు ఎస్2 ఫార్మ్‌ను ధ్రువీకరించుకోవాలి

నిర్మల్‌రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో గల సీసీఎస్ ఉద్యోగులు వారి సీసీఎస్ లాగిన్‌లో మొబైల్ నెంబర్, పాన్‌కార్డు, ఈమెయిల్, నామినేషన్ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేవో చూసుకుని సరిచేసుకోవాలని జిల్లా ఖజానా అధికారి ఎస్.సరోజ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఇందులో భాగంగా సీసీఎస్ ఉద్యోగి తన ఎస్2 ఫార్మ్‌ని ధ్రువీకరించి సంబంధిత ట్రెజరీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే సంబంధిత ట్రెజరీ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ

» కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

భైంసారూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఎటువంటి అంతరాయాలు లేకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని కలెక్టర్ అభిలాష అభినవ్ వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం భైంసా మండలం మాటేగాం గ్రామంలోని నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మూడోదశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్, నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులతో మాట్లాడారు. బ్యాంకు ఖాతాలు తెరవడంలోనూ, కులధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియలోనూ, అలాగే నామినేషన్ కేంద్రాల్లోనూ ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థుల నుంచి వచ్చిన స్పందన ఆధారంగా ఫీల్డ్‌లో అన్నిశాఖలు సమన్వయంతో వ్యవహరిస్తున్నాయని సంతృప్తి వ్యక్తంచేశారు. ఇప్పటివరకు స్వీకరించిన నామినేషన్ పత్రాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి, నిబంధనల ప్రకారం నమోదు సక్రమంగా జరుగుతున్నాయో లేదో తనిఖీచేశారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్, ఎంపీడీవో నీరజ్ కుమార్, డీఎల్‌పీ లక్ష్మణ్, ఎంఈవో సుభాష్, ఎంపీవో ప్రదీప్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

తొలిదశ ర్యాండమైజేషన్ పూర్తి

నిర్మల్ చైన్‌గేట్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. మొదటి విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు తొలిదశ ర్యాండమైజేషన్ మండలాల వారీగా నిర్వహించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ఎన్నికల విధులకు సరిపడా సిబ్బంది నియమించామన్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అవసరానికి 20 శాతం అదనంగా అధికారులను నియమించుకున్నట్లు పేర్కొన్నారు. దీనిద్వారా ఎన్నికల నిర్వహణలో అధికారులు కొరత తలెత్తకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీపీవో శ్రీనివాస్, డీఈవో భోజన్న, అధికారులు ఉన్నారు.

చిన్న పరిశ్రమలు ఎంతో ఉపయోగకరం



శ్రీధర్, నవనీత దంపతులను ప్రశంసిస్తున్న శాస్త్రవేత్త లక్ష్మీకాంత్

నిర్మల్‌రూరల్,డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాల్లో చిన్న పరిశ్రమలు ఎంతో ఉపయోగపడతాయని సీనియర్ శాస్త్రవేత్త లక్ష్మీకాంత్ అన్నారు. మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన ఎలిశెట్టి శ్రీధర్ తన మినీ రైస్‌మిల్ గత మూడేళ్ల నుంచి నడిపిస్తున్నాడు. అయితే ఈ మినీ రైస్‌మిల్ ఏ విధంగా పనిచేస్తుంది, అది రైతులకు, అలాగే గ్రామీణ ప్రాంతా వారికి ఏవిధంగా ఉపయోగపడుతుంది. దాంట్లో ఉన్న లోపాలేంటి? అనే విషయాలను పూర్తిగా అడిగి తెలుసుకుని పరిశీలించారు. సీనియర్ శాస్త్రవేత్త లక్ష్మీకాంత్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నిరుద్యోగం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఇలాంటి చిన్నపరిశ్రమలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఇందులో ఉపాధితోపాటు నాణ్యతను ప్రజలకు అందుకోగలుగుతారని చెబుతూ దీన్ని వాడుతున్న శ్రీధర్ నవనీతని ప్రశంసించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త లక్ష్మీకాంత్, హర్షవర్ధన్‌మానే, రాజశేఖర్, డీఆర్‌డీఏ హరిజాబాయి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అవినాష్ పాల్గొన్నారు.

బాక్సింగ్ అండర్-14 బాలుర జిల్లాస్థాయి ఎంపిక పోటీలు



ఎంపికైన విద్యార్థులు

నిర్మల్‌రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): 69వ ఎస్‌జీఎఫ్ నిర్మల్ ఆధ్వర్యంలో శుక్రవారం బాక్సింగ్ అండర్-14 బాలుర జిల్లాస్థాయి ఎంపిక పోటీలను పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించినట్లు డీఈవో భోజన్న తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులు త్వరలో జరిగే కొమరం భీమ్, ఆసిఫాబాద్ జిల్లాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ఎంపిక పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయులు సత్తయ్య, సుమలత, బాక్సింగ్‌కోచ్ ఉన్నారు.



చేతి కర్రలను పంపిణీ చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

దివ్యాంగుల పింఛన్‌ను పెంచాలి

భైంసా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ దివ్యాంగుల పెన్షన్ పెంచి తక్షణమే చెల్లించాలని చేపట్టాలని జనసే పార్టీ నిర్మల్ జిల్లా ప్రతినిధి సుంకెట మహేష్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం భైంసాలోని ఎంపీడీవో కార్యాలయ అవరణలో వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ చెల్లింపుల పెంపుదలను విస్మరించడం సబబు కాదన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొన్న పెంపుదలకు అనుగుణంగా పెన్షన్ చెల్లింపులకు చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఆందోళనలను తప్పవని వెల్లడించారు. అంతేకాకుండా పెంచిన పెన్షన్లను క్రమం తప్పకుండా ప్రతీనెల సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ కేర్ అడ్మినిస్ట్రేషన్ కో ఆర్డినేటర్ సాయన్న ఆధ్వర్యంలో అందులకు చేతికర్రలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇందులో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బురుగుల రాజు, కార్యదర్శి భోజారెడ్డి, ఆయా ప్రాంతాల దివ్యాంగులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

సోన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి శ్రీనివాస్, సొండి గంగయ్యలు ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మండల నాయకులు డా. నరేష్, బోనగిరి నర్సయ్య, సంతోష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ ఉప సర్పంచ్

నిర్మల్‌రూరల్: మండలంలోని తాంశ గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ మహేష్ రెడ్డితోపాటు పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల నాయకులు జమాల్, శ్రీనివాస్, గంగాధర్, రాములు, జి.శ్రీనివాస్, బక్కన్న, సాగర్, సుధాకర్, రవి పాల్గొన్నారు.



పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే



మట్టి పరీక్ష చేస్తున్న వ్యవసాయ అధికారులు



విద్యార్థులకు నేల గురించి వివరిస్తున్న అధికారులు

నేల ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన పంట

» రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి
» మండల వ్యవసాయ అధికారి వినోద్ కుమార్



రైతు వేదికలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

సోన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): నేల ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని మండల వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. వ్యవసాయ అధికారులు శుక్రవారం మండల కేంద్రంలోని పోగుల పోశెట్టి వ్యవసాయ పొలంలో మట్టి నమునాలు సేకరించి పరీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ పంట వేసే ముందు రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా రైతుల పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాకుండా అవసరమైన ఎరువులను మాత్రమే వేయవచ్చని అన్నారు. నేల ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని వివరించారు. నేలలో సేంద్రియ కర్బన్ శాతం పెరిగి నేల ఆరోగ్యంగా ఉంటుందని, కేవలం 2నిమిషాల్లో మట్టి పరీక్ష చేయు డిజిటల్ టెక్నాలజీ (ఏఐ) ఆధారిత పరికరం మండలపరిధిలో అందుబాటులో ఉన్న సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. ఏఈవోలు అశోక్‌కుమార్, ఉమామహేశ్వరి, భూసార పరీక్షా కేంద్ర నిర్వాహకులు, రైతులున్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

నిర్మల్‌రూరల్: ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా మండలంలోని చిట్యాల రైతు వేదికలో శుక్రవారం రైతులకు భూసార పరీక్ష గురించి అవగాహన కల్పించినట్లు ఏఈవో రజిని తెలిపారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష కిట్‌ను ఉపయోగించి భూసార పరీక్ష చేయించి, భూసార ఫలితాలను రైతులకు సూచించారు. రైతులు ఖచ్చితంగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, పంటలకు తగిన మోతాదులో రసాయన ఎరువులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ముథోల్: మండలంలోనిఎడ్‌బిడ్ గ్రామంలో గల ఫ్యూచర్ కాన్సెప్ట్ స్కూల్‌లో శుక్రవారం ప్రపంచ నేల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వ్యవసాయ క్షేత్రానికి తీసుకువెళ్లి నేలల రకాలను వివరించారు. నేలను సారవంతంగా ఉంచాలని, సేంద్రియ ఎరువులను వాడాలి. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వివరించారు.

ఎలక్ట్రానిక్ కాంటాలు ట్యాంపరింగ్ చేస్తే కఠిన చర్యలు

» మార్కెట్ నిర్మల్ కమిటీచైర్మన్ సోమ భీమ్‌రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ కాంటాల ట్యాంపరింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు ఎంతో కష్టపడి పత్తి, వరి, మొక్కజొన్న పంట, సోయా పంటలను సాగుచేసి విక్రయించేందుకు వస్తే కొంతమంది అనధికారిక వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాంటాల ట్యాంపరింగ్‌కు పాల్పడి వారిని మోసం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఎల్రక్టానిక్ కాంటాల ట్యాంపరింగ్‌కు పాల్పడి రైతులను మోసం చేస్తున్న వ్యవహారాలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మోసాలను గుర్తించే రైతులు మార్కెట్ కమిటీ ఆఫీస్ గానీ, పోలీసులకు గానీ ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది అన్నికొనుగోలు కేంద్రాలపై నిఘా సారించాలని తెలిపారు. ఇతర జిల్లాల్లో జరుగుతున్న సంఘటన కారణంగా మార్కెట్ కమిటీ అధికారులు అప్రమత్తమయ్యారని వివరించారు. రైతులను మోసం చేస్తే ఎంతటి వారైనా సహించేది లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని, కొంతమంది తప్పుడు పనుల కారణంగా రైతులు ఇబ్బందులకు గురైతే చూస్తూ ఊరుకోబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎల్రక్టానిక్ కాంటాల తనిఖీల కోసం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు భీమ్‌రెడ్డి వెల్లడించారు.